ప్రజాశక్తి

మంగళవారం 14 జనవరి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



జిఎంసి ఆధ్వర్యంలో సంబరాలు

పల్లెల్లో సంక్రాంతి సందడి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సంబరాలు ప్రారంభం

తరలివచ్చిన బంధుగణంతో

గ్రామీణుల్లో ఉత్సాహం

2లో



పెదకాకానిలో మాట్లాడుతున్న నేతాజి

విద్యుత్ బిల్లులతో భోగి మంటలు

భారాలపై సిపిఎం ఆధ్వర్యంలో

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు

2లో



హోరాహోరీగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన సోమవారం విజయనగరం-కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో విజయనగరం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన విజయనగరం జట్టు ఫీల్డింగ్ తీసుకోగా బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టంతో 115 పరుగులు చేసింది. 116 పరుగుల విజయ లక్ష్యంతో బారిలో దిగిన విజయనగరం జట్టు 3 వికెట్ల నష్టంతో 11.04 ఓవర్లలోనే లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. అనంతపురం - శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. 121 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 118 పరుగులే చేయడంతో అనతపురం



జట్టు 3 పరుగుల ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈవెంట్ స్పాన్సర్లగా సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ, వి డిజిటల్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపి టీవీ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రచారం చేస్తున్నారు. ప్రీమియర్ లీగ్, సిజన్-3 పోటీల్లో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలను కొమ్మారెడ్డి కిరణ్, ద్వితీయ బహుమతి కింద రూ.2 లక్షలు కాట్రగడ్డ మధుసుదన్‌రావు, తృతీయ బహుమతి కింద రూ.లక్షను పల్నాటి నాగేశ్వరరావు, అమ్మిరెడ్డి సాంబశివరావు సహకారంతో ప్రదానం చేయనున్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.50 వేలు బత్తుల హరిదాస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.25 వేలను కాసరనేని జస్వంత్, బెస్ట్ బౌలర్‌కు రూ.25 వేలను తాడిపత్రి అజయ్ కుమార్, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.10 వేల నగదును భోగి వినోద్, కనికళ్ల చిరంజీవి సహకారంతో అందించనున్నారు.

ఇకపై రేయింబవళ్లు డ్రోన్ కెమెరా నిఘ

ప్రజాశక్తి-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలను ఆపరేట్ చేస్తున్నారు. నేరాలను తగ్గించే దిశలో ఈ డ్రోన్ కెమెరాలు కీలక పాత్ర పోషించబోతున్నాయని డీఎస్పీ హనుమంతరావు చెప్పారు. పేకాట, కోడి పందేలు, దొంగతనాలు, ఆరు బయట మద్యం సేవించడం, ఘర్షణలకు పాల్పడడం, హత్యలకు పాల్పడడం, స్త్రీలపై లైంగిక దాడులకు పాల్పడం, ఆస్తి ధ్వంసం చేయడం లాంటి కార్యకలాపాలు పెరుగుతున్న తరుణంలో నేరస్తులను త్వరితగతిన గుర్తించేందుకు, పూర్తిస్థాయిలో నేర విచారణ చేసేందుకు ఈ డ్రోన్ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని డీఎస్పీ చెప్పారు. నేరస్తులు ఎంతటి వారైనా, డబ్బు రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు సైతం తప్పించుకోవడానికి వీలులేని విధంగా డ్రోన్ కెమెరాలు సహాయపడతాయని అన్నారు. ఎప్పుడైనా, ఎక్కడైనా పగలనకా రాత్రనక వీటిని ఆపరేట్ చేస్తామని చెప్పారు.

విద్యుత్ బిల్లులతో భోగి మంటలు

భారాలపై సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరసనలు

ప్రజాశక్తి - పెదకాకాని

పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేయడం ఆనవాయితీ కాగా ప్రభుత్వ విధానాల ఫలితంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాల్సి వచ్చిందని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి అన్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆ పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాయి. పలు గ్రామాలు, పట్టణాల్లో భోగి మంటలేసి ఆందులో విద్యుత్ బిల్లులు ప్రతులను కాల్చారు. ఇందులో భాగంగా పెదకాకానిలో జరిగిన కార్యక్రమానికి ఆ పార్టీ మండల కార్యదర్శి



ఎస్.శివాజి అధ్యక్షత వహించగా నేతాజి మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన మాటను కూటమి తప్పిందన్నారు. విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో సిపిఎం ప్రజల పక్షాన నిలిచి తన వాదనను వినిపించిందని, విద్యుత్ భారాలు ప్రజలపై వేయకుండా ఉండే మార్గాలను సూచించిందని చెప్పారు. టిడిపి, బిజెపి, జనసేన కమిషన్ ముందుకు రాలేదని, అవి ప్రజలకు చెందిన పార్టీలు ఎలా అవుతాయని నిలదీశారు. అవినీతి ఒప్పందాలు కుదుర్చుకున్నప్పుడు కమిషన్ ఏమైందని ప్రశ్నించారు. డిస్కముల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్నారు. స్మార్ట్ మీటర్లు ఎవరి కోసం పెడుతున్నారని ప్రశ్నించారు. అదానీ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాబురావు, బి.సాంబయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, ఎ.నాగేశ్వరావు, ఎస్.విజయలక్ష్మి, ఎం.మంగమ్మ, పి.మరియమ్మ, షేక్ మరింబి, కె.లక్ష్మి, సిహెచ్ అంకాలు పాల్గొన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సందడి

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సంబరాలు ప్రారంభం
- తరలివచ్చిన బంధుగణంతో గ్రామీణుల్లో ఉత్సాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సంక్రాంతి వేడుకలు సోమవారం ఉదయం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, ఇతరదేశాల నుంచి కూడా స్థానికులు, వారి స్నేహితులు, బంధుగణం సొంత ఊళ్లకు వచ్చారు. పట్టణాలు, నగరాల్లో సాఫ్టవేర్ రంగంలో స్థిరపడిన వారు సొంత ఊళ్లకు చేరుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, బెంగుళూరు, చెన్నైతో పాటు విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి కూడా జిల్లాకు వేలాది మంది తరలి వచ్చారు. అమెరికా, కెనాడా, ఆస్ట్రేలియా దేశాల్లోని జిల్లా వాసులు వారి సొంత గ్రామాలకు వచ్చారు. సొంత వాహనాలు, రైళ్లు, బస్సుల ద్వారా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది సాఫ్టవేర్ ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులు కుటుంబాలతో జిల్లాకు చేరుకున్నారు. ప్రధానంగా గుంటూరు, తాడికొండ, తెనాలి, వేమూరు, పొన్నూరు, మాచర్ల, పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాల ఎన్ఆర్ఐలు, సాఫ్టవేర్ ఇంజినీర్లు జిల్లాకు తరలిరావడం కన్పించింది. వీరందరి రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది.

కుటుంబంలోని రక్తసంబంధీకులు, బంధువులు యావత్తు ఏడాదికి ఒకసారి ఒకచోట కలిసి పండగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు తమ బంధువల రాకకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బంధువులతో పాటు పలు ప్రాంతాల్లో గ్రామస్తులతో, స్థానికులతో కలిసి సంబంరాలు నిర్వహిస్తున్నారు. అయితే పిండివంట ఘుమఘుమలు తగ్గాయి. కొన్నేళ్లక్రితం నెలరోజులపాటు



ఉండేలా నేతితో పిండి వంటలు చేసే వారు. ఇప్పుడు పిండివంటలు చేయలేక స్వీట్ హోంలలో ఆర్డర్లు ఇస్తున్నారు. మిఠాయి దుకాణాల్లో ప్రత్యేక తెలుగు సంప్రదాయ పిండివంటలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన వారు దుకాణాల్లో కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.

సోమవారం భోగి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి రెండు జిల్లాల పరిధిలో అన్ని ప్రాంతాల్లో భోగి వేడుకలు నిర్వహించారు. తొలుత భోగి మంటలు వేశారు. ఇళ్లలోని పాత సామాన్లను మంటలలో వేసి నిప్పులపై వేడినీళ్లు కాచి తలస్నానం చేయడం సంప్రదాయంగా వస్తోంది. భోగిమంటల్లో చిన్నా పెద్దా ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి వేడుకల సందర్భంగా అధికార ప్రతిపక్ష పార్టీలు కూడా తమదైనశైలిలో స్పందించారు. అధికార పార్టీ నాయకులు ప్రభుత్వం తరుపున నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో పాల్గొని భోగివేడుకల్లో పాలు పంచుకోగా సిపిఎం నాయకులు విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా బిల్లులను భోగి మంటలలో వేసి నిరసన తెలిపారు. గుంటూరు కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబంరాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్ కుప్పం ప్రాంతానికి వెళ్లారు. తెనాలి వేడుకల్లో మంత్రి నాదెండ్ల మనోహం పాల్గొన్నారు.

మంగళవారం సంక్రాంతి వేడుకలు, మంగళవారం కనుమ పండగ నిర్వహించేందుకు అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని ఆటల పోటీలు, పతంగులను ఎగురవేయడం, కోడిపందేల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. అధికారులు నియంత్రిస్తున్నా డెల్టా ప్రాంతంలో కోడిపందేల నిర్వహణకు సన్నద్ధం అవుతున్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాలల్లోని జంపని ,తూర్పుపాలెం, క్రాప, అనంతవరం, పల్లెకోన తదితర ప్రాంతాల్లో కోడిపందాల నిర్వహిస్తుండటంతో చూసేందుకు గుంటూరు, పల్నాడు ప్రాంతాల వాసులు కూడా తరలివెళ్తున్నారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, అధికారుల బంగ్లాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి నాయకులు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలు, విద్యా సంస్థలు, కార్యాలయాల్లో రంగవల్లులతోపాటు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజెప్పేందుకు పిల్లలకు నాటి తరం వేడుకలను పెద్దవారు వివరిస్తున్నారు.

పద్య కవిత్వంతో జాషువా, పాటతో గద్దర్

- ప్రజాచైతన్యం కోసం జీవితాంతం కృషి
- ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్ సి.కాసిం

ప్రజాశక్తి - వినుకొండ

అంటరానితనం, అణిచివేతలపైన మహాకవి గుర్రం జాషువా తన పద్య కవిత్వం ద్వారా జీవితాంతం పోరాడగా, జాషువా అందించిన కర్తవ్యాన్ని ప్రజా గాయకుడు గద్దర్ తనదైన శైలిలో పాటల ద్వారా కొనసాగించారని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాసిం అన్నారు. విద్యావంతుల వేదిక ప్రారంభ సభ స్థానిక సురేష్‌మహల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. సభకు అధ్యక్ష వర్గంగా న్యాయవాది పిజె.లూకా, కోల నవజ్యోతి, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. ప్రొఫెసర్ సి.కాసిం మాట్లాడుతూ గద్దర్ తన జీవితాంతం పాటల రూపంలో ప్రజాచైతన్యం కోసం కృషి చేశారని, ప్రజల మధ్యన ఉండి, దళితుల, ఆదివాసీల హక్కుల కోసం తన గొంతును ప్రయోగించారని చెప్పారు. ప్రస్తుతం ఆ కర్తవ్యాన్ని గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ కొనసాగిస్తూ ముందుకు నడుస్తున్నారని చెప్పారు. గద్దర్ బాటలో ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసమే పని చేస్తానని గద్దరు బిడ్డ వెన్నెల గద్దర్ ఇదే వేదికపై ఉద్ఘాటించారు. విద్యావంతుల వేదిక కర్తవ్యాలను సిహెచ్ఎల్ఎన్. మూర్తి వివరించారు. ఎయిమ్స్ విశ్రాంత



ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ సమాజ మార్పు కోసం మన ముందు తరాలు చేసిన త్యాగం వృథా కాదని, దాని ఫలితాలు మనం ఇప్పుడు అనుభవిస్తున్నామని అన్నారు. వారిని స్మరించుకుంటూ ఆ బాటలోని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రగతిశీల మహిళా సమైక్య జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ త్యాగాలలో, పోరాటాలలో మహిళల పాత్ర చాలా విలువైందని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయ వేడుక దినంగా ప్రకటించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇలాంటి వేదికలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రజల సమస్యల పట్ల ప్రశ్నించే గొంతుకలు ముందుకు వస్తాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి బాటలు పడతాయని అన్నారు. కార్యక్రమానికి న్యాయవాది విజయ్ సమన్యాయకర్తగా వ్యవహరించగా, ప్రముఖ చిత్రకారులు జస్టిస్ చిత్రించిన అమరుడు బాలవజ్రం చిత్రపటాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. దుబ్బల దాసు (సహజ కవి), టి.జె ప్రసాద్ (ఎడారి కోయిల) రాసిన సాహిత్య గ్రంథాలను సభలో ఆవిష్కరించారు. బిక్కి రాములు భార్య మంగమ్మ, శాంతిరేఖ, పి.రూబెన్, పగడాల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ నాయకులు బిఎ.సత్తార్ పాల్గొన్నారు.

వైవిధ్యంగా సంక్రాంతి



ప్రజాశక్తి-సత్తెనపల్లి: ప్రముఖ న్యాయవాది, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్య తన మనుమరాలి కోసం నిర్మించిన ఇంటి ప్రారంభోత్సవానికి సంక్రాంతి సందర్భాన్ని ఎంచుకున్నారు. తన కుటుంబం, బంధువులను ఆహ్వానించి అందర్నీ మండం లోని గుడిపూడికి పిలిపించి అందరూ ఒకేచోట కూడేలా చేశారు. సాహితీ పేరుతో ఉన్న నిర్మాణం పలు అభ్యుదయ కార్యక్రమాలకు నెలవు కావాలని నిర్మాణ కార్యనిర్వాహక యజ మాని నిర్ణయంతో హర్షధ్వానాలు రేకెత్తించాయి. గానామృతం, సన్మానాల సందడి, వక్తల భావోద్వేగం, విందు భోజనాలతో బహుముఖ సంబరాలకు ఆ ఇల్లు వేదికైంది. ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, సభ్యులు కె.నాగేశ్వరరావు ఆలపించిన అభ్యుద య గేయాలు ఆకట్టుకున్నాయి. జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన షేక్ రోషన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గంగూరు అజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవగా న్యాయవాదులను సన్మానించారు. జాతీయ కబడ్డీ క్రీడాకారిణి పి.లక్ష్మీబాయి, ప్రముఖ కళాకారులు ఎం.సాంబశివరావు, అమెరికాలో ఇంజినీరు సంజయ్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకుందాం

ప్రజాశక్తి -దుగ్గిరాల

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక , వ్యవసాయ కార్మిక, పేదల సమస్యలను శాసనమండలిలో పరిష్కారానికి కృషి చేస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టపద్రుల నియోజకవర్గానికి తిరిగి పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న కె ఎస్ లక్ష్మణరావుకి మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. సోమవారం దుగ్గిరాల మండలంలోని మంచికలపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ లాయర్స్ యూనియన్ నాయకులు వై. స్టాలిన్ అధ్యక్షతన కేఎస్ లక్ష్మణ్ రావును గెలిపించాలని కోరుతూ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామంలో ఉన్న పట్టభద్రులందరూ హాజరయ్యారు. ఈమని అప్పారావు మాట్లాడుతూ కేఎస్ లక్ష్మణ్ రావు కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించడమే కాకుండా రైతులు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా శాసనమండలిలో ప్రశ్నించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారాన్ని కృషి చేస్తున్నారని తెలిపారు. దుగ్గిరాల మండలంలోని హై లెవెల్ ఛానల్ సమస్య పైన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ లో పసుపు దగ్ధమైనప్పుడు రైతులకు అండగా కేఎస్ లక్ష్మణ్ రావు నిలబడ్డారని తెలిపారు .అలాగే విద్యారంగంలో వస్తున్న మార్పులను పేద విద్యార్థులకు అనుగుణంగా ఉండేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లాయర్స్ యూనియన్ నాయకులు వై.స్టాలిన్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఉద్యోగులు, పట్టభద్రులు , లాయర్లు, డాక్టర్లు, నిరుద్యోగులు అందరూ కేఎస్ లక్ష్మణ్ రావు కి మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని కోరారు. .వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వర రావు, డివైఎఫ్ఐ నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వై. తనుజ, వై. చేగువేరా, వై .వినోదు ,వై .గోపి ,వై .మని ,సంధ్య ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు వై. స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

సంక్రాంతి సందర్భంగా ఆవాజ్, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గుజ్జనగుండ్లలో ప్రజా సంఘాల కార్యాలయం సుందరయ్య భవన్ వద్ద ఆటల పోటీలు నిర్వహించారు. కుర్చీలాట, బుట్టలో బంతి, జడలోస్ట్రా, లెమన్ అండ్ స్పూన్, స్లో సైక్లింగ్ మొదలైన ఆటలు నిర్వహించగా, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం షేక్.భాషా అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిస్టి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, కులమత భావనలు విడిచి అందరూ సోదరీ, సోదర భావంతో జీవించాలని కోరారు. ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి మాట్లాడుతూ మహిళల సమస్యల కోసం ఐక్యంగా ఉండి కషి చేయాలని అన్నారు. అనంతరం ఆవాజ్ నాయకులు జనాబ్ షేక్ సుబానీ బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జనగుండ్ల ఏరియా ఐద్వా కార్యదర్శి షేక్.షకీల, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకురాలు అనురాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) నగర కార్యదర్శి షేక్ ఖాసిం వలి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎండి సాదిక్, వేమారెడ్డి, డి.కోటేశ్వం ˊరావు, సత్యనారాయణ , ఆంజనేయులు, రంగా, స్వాతి, లక్ష్మి , హైమావతి, అంజలి, సమీరా, అన్నే మేరీ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న మహిళలు

సాంస్కృతిక రంగంలో బహుజనులు కీలకం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దళిత, బహుజన, మైనార్టీలు సాంస్కృతిక రంగంలో ఆధిపత్యం పెంపొందించుకోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అరండల్ పేట లోని అమరావతి బుక్ హౌస్ లో దళిత సంక్రాంతి (విద్యా - ఉపాధి - సంస్కృతి) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కాలంతోపాటు దళిత, బహుజన, మైనార్టీలు కూడా మారాలన్నారు. విద్యా ఉపాధి ఒక సంస్కృతిగా దళితులు రూపొందించుకోవాలని ఆయన కోరారు. డి బిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కోరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే సంవత్సరం మొత్తం చేసిన శ్రమ ఫలితమైన పంటల పండుగని ఈ పాడి పంటలు చేతికి రావడానికి దళితుల శ్రమే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి సి కె పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, దళిత నాయకులు అత్తోట జోసఫ్ కుమార్, రాజారావు సంకూరి, సుకుమార్, నాయి బ్రాహ్మణ సంఘం జేఏసీ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు చిరుతనగండ్ల వాసు ,ఓర్సు ప్రేమరాజు, కరుణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కుమరాల ఏసుదాసు ఎంజేజే ఎస్ అధ్యక్షులు పినపాటి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి - వినుకొండ



ఆర్టీసీ బస్సు ఢీ కొన్న రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన వ ం డ ల ం లో ని అందుగుల కొత్తపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కుర్ర తిరుపతయ్య (18) యువ గొర్రెల కాపరి జీవాలను మేపుకొని సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వెళుతుండగా కొత్తపాలెం గ్రామ సమీపం కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వినుకొండ ఆర్టిసి డిపోకు చెందిన బస్సు ఎర్రగొండపాలెం నుండి వినుకొండ వైపు వెళుతూ వేగంగా గొర్రెల మందపై దూసుకు వెళ్ళింది. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి కుర్ర తిరుపతయ్యతో పాటు 40 జీవాలు మృతి చెందాయి. మరో 10 గొర్రెలు గాయాల పాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని తిరుపతయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గొర్రెల కాపరి మరణ వార్త తెలుసుకున్న మతుని కుటుంబ సభ్యులు, తోటి గొర్రెల కాపరులతోపాటు కొత్తపాలెం గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగడంతో గంటపాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కొత్తపాలెం గ్రామం వద్ద నేషనల్ హైవేపై సర్వీస్ రోడ్డు లేకపోవడం వలనే తరచూ ఇటువంటి ప్రమాదాలు సంభవించి అమాయకులు బలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవాలపై ఆధారపడి కుటుంబ జీవనం సాగిస్తున్న తిరుపతయ్యతో పాటు 40 జీవాలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం అన్ని విధాల కోల్పోయిందని బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.





మాట్లాడుతున్న ఎం రవి, బహుమతి ప్రదానం చేస్తున్న సావిత్రి తదితరులు

ఎర్రబాలెంలో ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సంక్రాంతి సందర్భంగా రాజధాని ఎర్రబాలెం ఇండస్ట్రీయల్ కాలనీలో సోమవారం రైతు, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో ఆటలపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, బాలలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభకు రైతు సంఘం నాయకులు అత్తలూరి వీర వెంకయ్య అధ్యక్షత వహించారు. సభలో సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి ప్రసంగించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యువత కోడి పందేలు, జూదం లాంటి దురలవాట్లకు గురికాకుండా, ప్రత్యామ్నాయ పద్ధతిలో ఐక్యత కోసం, శరీర దారుఢ్యం కోసం, ఆహ్లాదం కోసం ఆటల పోటీలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సిఐటియు, ఐద్వా, రైతు సంఘం కృషి చేస్తున్నాయని తెలిపారు. పోటీల్లో విజేతలకు సావిత్రి శర్మ, సీతారామ శర్మ, శారద బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ రామరాజు, ఎల్ రాధిక, కోటేశ్వరి, దివ్య, పార్వతి, సుజాత, చిలుకోటి సత్యన్నారాయణ పాల్గొన్నారు.




పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ కొల్లా హేమంతీ దేవి

కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

సంక్రాంతి పండగ సందర్భంగా పెదనందిపాడు లోని కామ్రేడ్ కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలను డాక్టర్ కొల్లా హేమంతీ దేవి ప్రారంభించారు. అచ్చం గల్లాలు, దాడి ఆట, అష్టా చమ్మా నాలుగు గడులు, తొక్కుడు బిళ్ళ, బచ్చాలాట, గోలీలాట, బొంగరాలాట, కుందుళ్ళును మొదటిరోజు పోటీలలో నిర్వహించడం జరిగిందని డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు తెలిపారు. మంగళవారం నిర్వహించనున్న పోటీలు పెద్దలకు, పిల్లలకు జరుగుతాయని, కాలితో కొబ్బరికాయ విసరటం, నెమ్మదిగా సైకిల్ తొక్కడం, మ్యూజికల్ చైర్స్, శ్రీశ్రీ గేయాలు, కుండ కొట్టుడు వంటి పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆటలు పోటీలు ముగిసిన అనంతరం బహుమతుల ప్రధానం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ గోపి, నన్నపనేని మోహన్ రావు, కొల్లా వెంకయ్య చౌదరి, నిమ్మగడ్డ సత్యనారాయణ, కొల్లా జగదీష్, కొల్లా సుజయ్ తదితరులు పాల్గొన్నారు.



కప్‌ను అందుకుంటున్న పల్నాడు థండర్స్ జట్టు

పడవలను పరిగెత్తించిన పల్నాడు థండర్స్

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన రామాపురం పల్లెకార్లకు గ్రామంలో ఘన స్వాగతం

ప్రజాశక్తి - దాచేపల్లి

సంక్రాంతి సందర్భంగా ఆత్రేయపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పడవల పోటీల్లో పల్నాడు థండర్స్ విజేతలుగా నిలిచారు. రెండ్రోజులపాటు జరిగిన పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. ఒక్కో జట్టుకు 12 మంది సభ్యులుంటారు. దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారులు 1000 మీటర్ల దూరాన్ని 4 నిమిషాల 16 సెకండ్లలో చేరి విజేతలుగా నిలిచారు. జట్టుకు రూ.లక్ష బహుమతితోపాటు షీల్డును, సభ్యులకు మెడల్స్‌ను అందజేశారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుతోపాటు రామాపురం నుండి పల్నాడు ప్యాంథర్స్ పేరుతోనూ మరోజట్టు పాల్గొంది. గెలిచి గ్రామానికి చేరుకున్న పల్నాడు థండర్స్ జట్టు సభ్యుల్ని గ్రామస్తులు ఘనంగా స్వాగతించారు. జట్టులో కె.వీరబాబు, ఎం.సైదులు, టి.చిన్నరాజు, యమ్.సైదులు, వెంకటేష్ కె.రాంబాబు, నాగరాజు, సైదులు, వి.వీరబాబు, టి.వీరబాబు, కె.సందీప్, జానీ ఉన్నారు.

ప్రజలకు పల్నాడు కలెక్టర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ.ముప్పాళ్లలో జరుగుతున్న 33వ రైతు మిత్ర జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సోమవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంజాబ్, ఝార్ఖండ్ జట్లను పరిచయం చేసుకొని వారితో కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు 33 ఏళ్లుగా ఈ పోటీలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించడి వారి ఐక్యతకు నిదర్శనమని, ఇదే స్ఫూర్తి కొనసాగి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు సైతం గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అనంతరం హోరాహోరీగా జరిగిన పంజాబ్-జార్ఖండ్ మధ్య మ్యాచ్‌లో పంజాబ్ జయభేరి మోగించింది. సత్తెనపల్లి - ఇనిమెళ్లకు జట్లకు మధ్య మ్యాచ్‌లో సత్తెనపల్లి విజేతగా నిలిచింది. సత్తెనపల్లి - ముప్పాళ్ల మ్యాచ్‌లో సత్తెనపల్లి తెలుపొందింది. పోటీలను తల్లపనేని రామారావు, టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, రాపర్ల రమేష్, రైతుమిత్ర కమిటీ నిర్వాహకులు సూరే కోటేశ్వరరావు, సూరే బ్రహ్మయ్య, పి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

భోగి మంటలేసి.. విద్యుత్ బిల్లులను తగలేసి..

ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల భారంపై సిపిఎం నిరసన - జిల్లా వ్యాప్తంగా తెల్లవారుజాము నుండే బిల్లుల దహనంతో నిరసన





ప్రజాశక్తి-క్రోసూరు

ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన చేపట్టింది. ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం శ్రేణులతోపాటు ప్రజా సంఘాలు విద్యుత్ విల్లులను భోగి మంటల్లో దహనం చేశాయి. సోమవారం తెల్లవారుజాము నుండి ఈ నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా క్రోసూరు, ఊటుకూరు, ఎర్రబాలెం, ఉయ్యందన గ్రామాల్లో విద్యుత్ బిల్లును దహనం చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి వైసిపి ప్రభుత్వం విద్యుత్ బారాలను ప్రజల మీద వేసినప్పుడు బాదుడే బాదుడని గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మరింత బాదుడు బాదుతున్నారని విమర్శించారు. ఈ నెలలో వచ్చిన బిల్లులను పరిశీలిస్తే వాడుకున్నది సగం అయితే పాత బకాయిల పేరుతో వేసిన భారాలు సగం ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, చిలుక యేసయ్య, దుద్దుల ఇశ్రాయేలు, షేక్ జాఫర్, మురళి, గర్నెపూడి మహేష్, గంజమల ఎలిశమ్మ, గారా నాగరాజు, శాఖమూరి మోహన్‌రావు నీరుకొండ కృష్ణ, తిమ్మిశెట్టి కుమారి, ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





ప్రజాశక్తి - సత్తెనపల్లి

పట్టణంలోని సిపిఎం కార్యాలయం వద్ద వేసిన భోగి మంటల్లో బిల్లుల దహనం అనంతరం ఆ పార్టీ పట్టణ కార్యదర్శి డి.విమల మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హయాంలో స్మార్ట్ మీటర్లను పెడుతుంటే పగలగొట్టాలని పిలుపునిచ్చిన టిడిపి నాయకులు ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగింపజేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, నాయకులు జి.బాలకృష్ణ, పి.సూర్యప్రకాశరావు, జె.రాజ్‌కుమార్, కె.శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, పి.వీరేశం పాల్గొన్నారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

మండలంంలోని రెంటపాళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి డి.అమూల్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూఆఫ్ ఛార్జీలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఛార్జీలను తక్షణం రద్దు చేయాలన్నారు. సాయికుమార్, సాయిసంజయ్, శైలు, వినీత, శిరీష, దీవెన, చంద్రిక, బాజీ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పాలపాడులో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. నాయకులు కొమ్ముల నాగేశ్వరరావు, టి.పెద్దిరాజు, అనీలు, కోటయ్య భాస్కర్ పాల్గొన్నారు. నరసరావుపేట పట్టణంతో మండలంలోని పలు గ్రామాలు, రొంపిచర్ల మండలంలోని గ్రామాల్లోనూ బిల్లుల దహనం చేపట్టారు.



ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పండరీపురంలోని సిపిఎం కార్యాలయం ఎదుట భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను, అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాతులూరి లూథర్, పి.భారతి, పి.శివ గణేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేయగా సిపిఎం అమరావతి కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు. మొహిద్దీన్‌వలి, డి.ప్రసాద్, పౌలు పాల్గొన్నారు.





ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని నూతలపాటివారి బజారులో స్థానికులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఎం.భవాని, జి.వెంకటరత్నం, సిహెచ్ మైథిలి, ఎన్.గోవర్ధని, ఎన్.సుబ్బాయమ్మ, నూతలపాటి విజయలక్ష్మి, నూతలపాటి కాళిదాసు పాల్గొన్నారు. ప్రజలకు భారంగా మారిన విద్యుత్ బిల్లులను తక్షణమే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలం వేల్పూరులోని కళామందిర్ సెంటర్లో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. నాయకులు కెవిఆర్ మోహన్‌చంద్, బోయపాటి వెంకటరాయుడు, సూరాబత్తుని గోవిందరాజు మాట్లాడారు. విద్యుత్ భారాలు సరికాదని విమర్శించారు.

ప్రజాశక్తి - అచ్చంపేట

వ్యవసాయ కార్మిక సంఘం: ఆధ్వర్యంలో అచ్చంపేటలోని పలు కుటుంబాలు విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేశారు. నాయకులు సుంకర ఆదినారాయణ, కత్తుల నాగ సంధ్య పాల్గొన్నారు.



పాలకుల విధానాలకు భోగి సెగ

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం


గుంటూరు సిపిఎం కార్యాలయం వద్ద


ప్రగతినగర్‌లో


జొన్నలగడ్డలో


పాతగుంటూరులో




సుందరయ్యనగర్‌లో


నగరాలలో


చేబ్రోలులో


మేడికొండూరులో


తాడికొండలో

ప్రజాశక్తి-గుంటూరు

ఇందన సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచటం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. సోమవారం నగరంలో పలు చోట్ల ప్రజలు భోగి సందర్భంగా విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. గుంటూరు సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద నాయకులు ఎ.కళ్యాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక దాదాపు రూ.16 వేల కోట్ల భారాన్ని సర్దుబాటు ఛార్జీల పేరుతో మోపారని విమర్శించారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి ఇబ్బంది పడుతున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల పెంపుతో మరింత భారం మోపారన్నారు. ప్రజలు అందరూ పెంచిన చార్జీలను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కె.అజయ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, టి,రాజేష్, ధీరజ్, వి.కుమార్, మాణిక్యరావు పాల్గొన్నారు.

ఇన్నర్ రింగు రోడ్డులోని ప్రగతి నగర్‌లో జరిగిన కార్యక్రమంలో గుంటూరు ప్రగతినగర్‌లో జరిగిన కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శి కె. నళినీకాంత్ మాట్లాడుతూ డిజిటల్ విద్యుత్ మీటర్లు తొలగించి, అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వీటి వల్ల రానున్న కాలంలో ప్రజలపై మరింత విద్యుత్ చార్జీలు పెరుగుతాయని చెప్పారు. కావున ప్రతి ఒక్కరూ విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపియం జిల్లా కమిటి సభ్యులు బి.ముత్యాలరావు, నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, చందు, పవన్‌కుమార్, డేరంగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు. పాతగుంటూరులోని బాలాజీ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మీనారాయణ, సుధీర్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సిపియం జిల్లా కమిటి సభ్యులు బి. లక్ష్మణరావు, నగర కమిటి సభ్యులు షేక్ ఖాశీం షహీద్, లూథర్‌పాల్, ఆది నికల్సన్, పాత గుంటూరులో జరిగిన కార్యక్రమంలో లక్కా అరుణ, టి. శ్రీనివాసరావు, ఎస్. కార్తీక్, మురళీకృష్ణ, సుబ్బారావు, నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమంలో టి. రాధ, సుచరిత, ప్రసాద్, విజయ్, నగరాలులో జి. రమణ తదితరులు పాల్గొని భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన తెలిపారు. **జొన్నలగడ్డలో :** విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి ఇమ్మడి రామారావు, సభ్యులు జొన్నల కోటిరెడ్డి, డి.అప్పిరెడ్డి, కొల్లి శివారెడ్డి, వి.శేషారత్నం, పి.సుజాత కె.శివారెడ్డి కె.రామిరెడ్డి, వి.వనసాక్షి, పి.శ్రావణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :** కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో పెంచిన విద్యుత్ బిల్లులను భోగి మంటలలో సిపిఎం శ్రేణులు దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, నీరుడు దుర్గారావు, మౌనిష్, కిరణ్ , వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో భోగి మంటలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతి రెడ్డి శ్రీనివాస కుమారి, నాయకులు దశరథరామిరెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :** తాడేపల్లి మండలం కుంచనపల్లి, గుండెమెడ, ఉండవల్లిలో భోగిమంటల్లో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. కుంచపల్లి, గుండెమెడలోలో తాడేపల్లి మండలం కార్యదర్శి పల్లెకృష్ణ విద్యుత్ బిల్లులు దహనం చేసి, అనంతరం ప్రసంగించారు. కుంచనపల్లిలో సిపిఎం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, ఎనుముల పార్థ, నాని, గొట్టిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గుండెమెడ కార్యక్రమంలో మనోజ్, బబ్లు, చిన్న, సాంబయ్య పాల్గొన్నారు. ఉండవల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం కార్యాక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మన్నూరు భాస్కరయ్య, నాయకులు వల్లభాపురం వెంకటే శ్వరరావు, ఉండవల్లి పార్థ సారధి, ఒలేటి శ్రీనివాసరావు, పలక లూరి గాంధీ, ఒలేటి చంచయ్యా, వల్లభాపురం మనోజ్ పాల్గొన్నారు. రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ఆధ్వర్యంలో ఉండవల్లిలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని నాయకులు కొ(్రపోలు ఈశ్వరరెడ్డి, ఆర్ వి రాఘవయ్య, రామకృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మంగళగిరిలో




చినకాకానిలో


కాజలో


ఎర్రబాలెంలో


ఆత్మకూరులో


ఉండవల్లిలో




తాడేపల్లిలో


తెనాలిలో


దుగ్గిరాలలో


ఎర్రబాలెంలో


పెదనందిపాడులో


కొత్తూరులో


కుంచనపల్లిలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎర్రబాలెంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఎం నాయకులు అత్తలూరి వీర వెంకయ్య, నాయకులు ఎస్.రామరాజు, ఎల్ రాధిక విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

చినకాకానిలో : చినకాకాని గ్రామంలో నిరసన కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు విద్యుత్ బిల్లును భోగి మంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి బాబు వరప్రసాద్, కాజ శివ శంకర్రావు, గుర్రం శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **కాజలో :** కాజా గ్రామంలో నాలుగు సెంటర్లలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఆర్దల శ్యామల జ్యోతి, కారుమూరు గోపాల్ రెడ్డి, ఝాన్సీ, కోటేశ్వరి, బి నిర్మల, బి.సత్యమారెడ్డి, కె .హరి కిషోర్, మేడా శివయ్య, వెంకటరామయ్య, చెన్నం కుమార్ స్వామి, పాలేటి అప్పారావు, నరసింహారావు పాల్గొన్నారు. **ఆత్మకూరులో :** రాష్ట్ర ప్రభుత్వం వేసిన విద్యుత్ సర్దుబాటు చార్జీల బారాలకు నిరసనగా ఆత్మకూరు గ్రామంలోని ప్రజలు విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి నిరసన తెలియజేశారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు డి శర్మ బి రాంబాబు సంధ్య సుజాత లక్ష్మి పూర్ణిమ నాగలక్ష్మి శకుంతల శివమ్మ శిరీష హేమలత తనూజ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - దుగ్గిరాల :** మండలంలోని తుమ్మపూడి, మంచికలపూడి గ్రామాలలో భోగిమంటలలో విద్యుత్ బిల్లులు తగలబెట్టారు. కార్యక్రమంలో నాయకులు జట్టి బాలరాజు వై స్టాలిన్ వై బ్రహ్మేశ్వర రావు ఏ పాములు శేషగిరి శ్రీకాంత్ మరియా దాస్ బాబురావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మంగళగిరి :** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన గా సోమవారం మంగళగిరి పట్టణంలోని 1,2,3,4 వార్డుల్లో పలు సెంటర్లలో సిపిఎం ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, నాయకులు కె శ్రీనివాసరావు ఎస్ గణేష్, ఎస్ వెంకటేష్, ఎస్ గోవింద్, ఎస్ నాగేంద్రబాబు, ఎస్ శంకర్, ఎస్ ప్రసాద్, ఎస్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తెనాలిరూరల్**

తెనాలిలో సిబిఎన్ కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు.కార్యక్రమంలో నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షక్ బాజి, తోట శ్రీనివాసరావు, టి సురేంద్ర, ఎస్.కె ఆశ బి, ఎన్ రాజ్యలక్ష్మి, టి లీల దుర్గ, యు శ్యామల, షేక్ సాజిత్, యు లక్ష్మి, వై ఈశ్వరి, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - పెదనందిపాడు :** మండలంలోని నాగులపాడులో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను సిపిఎం ఆధ్వర్యంలో తగులబెట్టారు. కార్యక్రమంలో నాయకులు కొత్త వెంకట శివరావు, ఎస్.కె మహబూబ్ సుభాని, చెట్టుపల్లి జెరీష్ బాబు, పూల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడికొండ : తాడికొండలో రైతు సంఘ ఆధ్వర్యంలో బోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతల భాస్కరరావు ,శ్రీరాములు, చంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
ప్రజాశక్తి - చేబ్రోలు : చేబ్రోలులో బోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆదిశేషు, పల్లా శ్రీనివాసరావు, పూజల చౌడయ్య, సిహెచ్ హనుమంతరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మేడికొండూరు:** మేడికొండూరులో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు తగులబెట్టిన అనంతరం సిపిఎం నాయకులు బొట్ట రామకృష్ణమాట్లాడారు.



తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఎన్టీఆర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తెలుగువారిఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని నర్సరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. సోమవారం సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెంలో ఏర్పాటు చేసిన దివంగత నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీతోఆపటు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టగలిగిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని ఎన్టీఆర్ ఆ రోజుల్లోనే చెప్పారని చెప్పారు. ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సినీ రంగంలోనూ, ఇటు రాజకీయంలోనూ ఎన్నో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు, భవిష్యత్తులోనూ ఆయన పేరు చిరస్మరణీయంగా మిగిలిపోయేలా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు చర్యలు

ప్రజాశక్తి - మాచర్ల



మాచర్ల నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తిరుపతి ప్రాంతంలో ఉండే ప్రముఖ కంపెనీలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఐటిఐ ప్లస్ అప్రెంటీస్ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభను పరిగణనలోకి తీసుకొని రూ.12 వేల నుంచి రూ.22 వేల వరకు వేతనాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 15వ తేదీలోగా క్యూఆర్ కోడ్ ఆధారంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

మట్టపల్లిలో గోదాదేవి పరిణయోత్సవం

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని తంగెడ గ్రామం కృష్ణా నది ఒడ్డున మట్టపల్లిలో గోదాదేవి పరిణయోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వయంభువుగా వెలసిన మట్టపల్లిలోని శ్రీ లక్ష్మీ నసింహ స్వామి వారి దేవాలయంలో గోదాదేవి కళ్యాణ ఘట్టం కన్నులపండువగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని గణపవరం అంబేద్కర్ భవన్ వద్ద దారా కొండయ్య ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉపాద్యాయులు చెవుల సుబ్బారావు, ఐఆర్ఎస్ అధికారి బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-వినుకొండ

సంక్రాంతి సందర్భంగా కారంపూడి రోడ్డులోని నూతనంగా ఏర్పడిన పద్మావతి నగర్‌లో ఈ నెల 16న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని, ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

శ్రీరామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు

మాచర్ల : పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక శ్రీ రామప్పదేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, కుంకుమ పూజ గావించారు.

పండగొచ్చింది.. సందడి తెచ్చింది!

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భోగి, సంక్రాంతి పండగ వేడుకలను ఊరూరా సందడి వాతావరణంలో నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణంలోని సిపిఎం కార్యాలయం వద్ద సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సిపిఎం కార్యకర్తలు, ఐద్వా మహిళలు కార్యాలయం ఆవరణలో సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులతో ముగ్గులు వేసి, రంగులతో అలంకరించారు. జై జవాన్.. జై కిసాన్ అని ముగ్గుతో చిత్రీకరించి తమ అభిమానాన్ని చాటారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు గద్దె ఉమాశ్రీ, ధరణికోట విమల, గుంటుపల్లి రజని, ఇంజం అరుణ, మునగా భారతి, పొట్టి సూర్యప్రకాశరావు, డి.పుల్లారావు, సుకన్య, సిహెచ్ దేవాన్ష్, శ్రీరామ్ చరణ్, కిషన్, అక్షయ, అమూల్య, లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.







భోగి, సంక్రాంతి వేడుకలను సోమవారం పట్టణం, పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ దృశ్యాలు...

మహిళలకు ఆటల పోటీలు

పిడుగురాళ్ల : సిఐటియు మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య కాలనీలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.దుర్గాబాయి మాట్లాడుతూ నేడు మహిళలు విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాల్లో ఉంటున్నారని.. మరోవైపు బయటకు వెళ్లాలంటేనే భయపడు తున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లోనూ, చదువుకునే ప్రాంతాల్లోనూ దాడులకు, అవమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను రక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, మహిళా సంఘం నాయకులు నాగమ్మ బాయ్, తెలకపల్లి కృష్ణవేణి, జనగాం రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

దాచేపల్లి : క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక శ్రమ కలిగి దృఢంగా మారుతారని సీఐ భాస్కరరావు అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై సౌందర్ రాజన్, గురజాల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కటకం అంకారావు, మండల అధ్యక్షుడు పాముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పండగలతో ఆహ్లాదం

మాచర్ల రూరల్ : పండగ సరదాలు ఆహ్లాదాన్ని అందిస్తాయని సీనియర్ రోటేరియన్, ప్రముఖ వైద్యులు కె.రామకోటయ్య అన్నారు. రోటరి క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. క్లబ్ సభ్యులందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు

మాచర్ల : పండగను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నకేశవ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో 'మనమూ పాడుదాం' సినీ పాటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక మానుకొండ కళ్యాణ మండపం ఆవరణలో 22వ తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలు లయన్స్ జిల్లా సాంస్కృతిక శాఖా అధ్యక్షులు డాక్టర్ ఎం.కమలహాసన్ రావు ఆధ్వర్యం లో జరిగాయి. 40 మంది గాయనీ గాయకులు ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

సత్తెనపల్లి రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహించాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళా సంఘం (ఐద్వా) పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగర తులసీరామ్ , రైతు సంఘం మండల నాయకులు రావూరి పూర్ణచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్సా, మహిళా సంఘం నాయకులు ఇంజం అరుణ, టి.లక్ష్మి, విజయలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా భోగి..

పల్నాడు జిల్లా : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రకాష్ నగరంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద చదలవాడ అరవింద బాబు.. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి భోగి మంటను వెలిగించి, సంబరాలు చేసుకున్నారు. ప్రజలతో కలిసి భోగి మంట చుట్టూ నత్యం చేశారు.









సత్తెనపల్లి, సత్తెనపల్లిటౌన్ : భోగి పండగను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామునే ఇళ్ల ముందు భోగిమంటలను వేశారు . దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

రెంటచింతల : ధనుర్మాసం ముగింపు సందర్భంగా భోగి వేడుకలను చిన్నాపెద్దా సంప్రదాయబద్ధంగా జరిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, నరసింహాశాస్త్రి, అబ్బూరి వెంకటేశ్వరరావు, శారదా సులోచన, అచ్చుల సుబ్బారావు, ప్రస్తుత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ తదితరులు పాల్గొన్నారు.



కళలకు ప్రాధాన్యం అవసరం

ప్రజాశక్తి - అమరావతి

సమాజాన్ని మేల్కొల్పే ప్రక్రియలో భాగంగా వినోదం, వికాసం, విజ్ఞానాన్ని సంపూర్ణంగా అందించాలంటే కళలకు, కళాకారులకు సమాజం ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరావటం రామకృష్ణ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళాకారుల సన్మాన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు కళాకారులు అర్ధాకలితో జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. రంగస్థలం, పౌరాణిక, జానపద కళాకారులను ప్రభుత్వం ప్రత్యేక నిధులతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.



డ్రోన్లతో నేరాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - దాచేపల్లి

సంక్రాంతి పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా డ్రోన్ టెక్నాలజీతో నిఘా పెట్టామని పట్టణ సీఐ భాస్కరరావు తెలిపారు. జూదం, కోడి పందాలు, గంజా, ఇతర అక్రమ కార్యకలాపాలను నియంత్రించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. సోమవారం మండలంలోని గామాలపాడు గ్రామంలో డ్రోన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



ఉత్తమ ఎస్‌హెచ్‌వోగా నాగార్జున

ప్రజాశక్తి- రెంటచింతల

ఉత్తమ ఎస్‌హెచ్‌వో(స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా రెంటచింతల ఎస్ఐ సి.హెచ్.నాగార్జునను ఎంపిక చేస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2018 బ్యాచ్‌కు చెందిన నాగార్జున గురజాల తాటికొండ స్టేషన్లో పని చేశారు. ఆగస్టు 14న రెంటచింతల ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారు. ఇక్కడే పని చేస్తున్న కానిస్టేబుల్ మమతకు ఉత్తమ మహిళ కానిస్టేబుల్ గా అవార్డు ప్రకటించారు. ఆమె స్టేషన్లో క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం విభాగంలో సమర్థవంతమైన విధులను నిర్వర్తిస్తున్నారు.

ఘనంగా గోదాదేవి కళ్యాణం

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని శ్రీ కోందరామాలయం, పాతూరు, బస్టాండ్ సెంటర్లోని వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో గోదాదేవి, వెంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గోదాదేవి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఏటా ధనుర్మాసంలో 30 రోజులపాటు సాగే ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పాశురాల పఠనం అనంతరం గోదాదేవి కల్యాణంతో ధనుర్మాస వ్రతం ముగుస్తుంది.



సందడిగా సంక్రాంతి సంబరాలు

సిఐటియు, ప్రజాశక్తి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్
మండలంలోని నిడమర్రు గ్రామంలో సీఐటీయూ, ప్రజాశక్తి, డీవైఎఫ్ఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా రెండు రోజులపాటు జరిగే వివిధ ఆటల పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మహిళలకు రంగవల్లులు, యువతకు కబడ్డీ, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కె.ప్రకాష్ రావు, రైతు సంఘం నాయకులు డి.గణేష్, కె.నాగేశ్వరరావు, జి.నాగేశ్వరావు, సురేష్, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.ప్రసన్న, ప్రజాశక్తి విలేకరి ఎం.సిరిబాబు తదితరులు పాల్గొన్నారు.





సుందరయ్య నగర్‌లో ఆటల పోటీలు
గుంటూరు : స్థానిక 41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు నల్లపాడు సీఐ కె.వంశీధర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విపిఎస్ నాయకులు గోనే లూథర్‌పాల్ అధ్యక్షతన జరిగిన సభలో సీఐ మాట్లాడుతూ పండగ అంటే కోడిపందాలు, జూదాలు కావని.. ప్రజలందరూ సంతోషంగా ఉండటం కోసమేనని తెలిపారు. ఎల్ఐసి యూనియన్ నాయకులు వి.వి.కె.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, సుందరయ్య నగర్ కార్యదర్శి ఆది నికల్సన్, కాలనీ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు నాయుడుపద్మ, షేక్.ఖాజాబి, సిఐటియు నాయకులు షేక్ మస్తాన్‌వలి, షేక్ ఖాశింషహీద్, ఎస్.పద్మనాభుడు, కె.ఆంజనేయులు, ఎ.సుకన్య, షేక్ నూర్జహాన్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో ఘనంగా సంబరాలు
దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలో స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు సోమవారం ముగిశాయి. బోస్ బొమ్మ సెంటర్లో భోగి మంటలు వేసిన అనంతరం.. కోలాటాలు, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీగా స్థానిక కళాశాల వరకు చేరుకుంది. ఆటలు, మహిళలకు ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక తహసీల్దారు ఐ.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ కె.గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామగ్రామాన భోగి వేడుకలు

ప్రజాశక్తి-పెదనందిపాడు
మండలంలోని గ్రామాలలో భోగి సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో స్వగ్రామాలకు తిరిగొచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు, వారి కుటుంబాలతో పల్లెలు కళకళలాడాయి. సోమవారం వేకువజామున పెదనందిపాడులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో భోగి మంటల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని వర్గాల వారూ సందడి చేశారు. పిల్లలకు భోగి పండ్లు వేసి, పండగను ఉత్సాహంగా జరుపుకొన్నారు.





ఏసీసీ కార్మికులకు పండగ రోజూ పస్తులేనా?

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
పండగ రోజు కూడా పస్తులు ఉండే దౌర్భాగ్య స్థితిలో ఏసీసీ కార్మిక కుటుంబాలు ఉన్నాయని ఏసీసీ కార్మిక పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అన్నారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్మికుల రిలే నిరాహార దీక్షలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. 32 సంవత్సరాలుగా కార్మికులు న్యాయ పోరాటం చేస్తుంటే.. పరిష్కరించాల్సిన పాలక పక్షాలు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమశక్తితో లాభాలు ఆర్జించిన యాజమాన్యం.. చట్టపరంగా తమకు రావలసిన నష్టపరిహారం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. లేబర్ కోర్టు తీర్పు అనంతరం కూడా ఏసీసీ కార్మికులకు నష్టపరిహారం అందించకపోవడం కార్మిక హక్కులను కాలరాయడమేనని చెప్పారు. దీక్షల్లో శారద, రమణ, శారమ్మ, బి.నవనీతం, నాగమల్లేశ్వరి కూర్చొన్నారు.



పిల్లలు ఆటలతోపాటు విద్యకూ ప్రాధాన్యమివ్వాలి

ప్రజాశక్తి-తాడికొండ
బాలలు ఆటలతోపాటు చదువుకు ప్రాధాన్యమివ్వాలని గరికపాడు సర్పంచ్ శకుంతల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం గరికపాడు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరటి తోటలు పెంచడం జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. బాలలకు వారి ఆలోచనలు, అభిప్రాయాలు చెప్పే హక్కు ఉందని, అవి ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దాసరి ముత్తమ్మ, తాయారమ్మ, క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి.వెంకట్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా కృషి అవసరం

ప్రజాశక్తి-తెనాలి
నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంచుకునే లక్ష్యాలు గొప్పగా ఉండాలని, దానికి తగిన కృషి అవసరమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్ రామ్ రీడింగ్ రూం కరుణానిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్ ప్రాంగణంలో ఐఓసిఎల్ డీలర్ యడ్లపల్లి రవి కిరణ్ సారధ్యంలో విద్యార్థులకు కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆది జాంబవ దళిత్ ఎంప్లాయీస్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పి.జె.రత్నాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తహసీల్దారు మాట్లాడారు. పాఠశాల దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యలో రాణించాలన్నారు.





'మిశ్రా కమిషన్ తీరు ఆక్షేపణీయం'

ప్రజాశక్తి-మంగళగిరి
ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఫిర్యాదులు స్వీకరించడాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ ఖండించారు. ఈ విషయమై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని గుర్తు చేశారు. సదరు కమిషన్ అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ, తుది దశకు చేరుకుందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు లోబడి పని చేయాల్సిన కమిషన్.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా కోర్టు పిటిషన్లను కొట్టివేస్తే.. రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ మాత్రం న్యాయస్థానం తీర్పునకు విరుద్ధంగా ఫిర్యాదులు స్వీకరించడాన్ని తప్పు పట్టారు. సదరు ఫిర్యాదులపై కమిషన్ విచారణ చేస్తుందా? అసలు ఆ అధికారం వారికి ఉందా అని నాగరాజు ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈపూరి ఆదాం మాదిగ పాల్గొన్నారు.

'చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి'

ప్రజాశక్తి-మంగళగిరి
చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశన శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా చూస్తున్నారే గానీ, వారి అభివృద్ధి ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలూ బీసీలను అణగదొక్కుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధానమంత్రిగా వీపీ సింగ్ ఉన్నప్పుడు బీసీ మండల్ కమిషన్ తీసుకొచ్చి.. తన పదవిని కూడా రాజీ పడకుండా త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రధాని చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నాయకులు శివరాం బాబాజీ, దాన గౌడ్, సాంబశివరావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.





వైభవంగా శివ ముక్కోటి

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం స్వామివారి ఉత్తర ద్వార దర్శన మహోత్సవం వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వారంలో బంగి వాహనంపై శ్రీ గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకులు టి.మహేష్ కుమార్ శర్మ పూజాధికాలు గావించారు.

భక్తుల ప్రసాద వితరణ
ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ఏటా శివముక్కోటికి వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఏడుకొండలు, గండికోట రాజారావు, వీర రాఘవులు, దుంపల సోములు, పంచల శివన్నారాయణ, సుబ్రహ్మణ్యం, గుండా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బకాయిల చెల్లింపుపై హర్షం

ప్రజాశక్తి-మంగళగిరి
పోలీసు ఉద్యోగులకు పెండింగులో ఉన్న బకాయిలను చెల్లిస్తూ, ప్రభుత్వం సంక్రాంతి కానుక ఇచ్చిందని ఏపీ పోలీస్ అధికారుల సంఘం ముఖ్య సలహాదారు అద్దేపల్లి గణపతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏడాదిగా పెండింగ్ లో ఉన్న గత ఏడాది జనవరికి సంబంధించిన ఏఎస్ఎల్ఎస్ బకాయిలు, సప్లమెంటరీ ఎస్ఎల్ఎస్ బిల్లులు, జీపీఎఫ్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను వెంటనే మంజూరు చేసేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా పోలీసుల ఖాతాల్లో నగదు జమ కావడంతో ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, ఉద్యోగుల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సందడిగా జిఎంసి సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు శనివారం రెండో రోజు భోగి పండుగ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు పూర్ణ కుంభం స్వాగతం, సన్నాయి మేళతాళాలు, భోగి మంటలు, గంగిరేద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆట పాటలు, చిన్నారులకు భోగిపళ్లతో ఎన్టీఆర్ స్టేడియం పండగ శోభతో ఆకట్టుకుంది. ప్రజలు, అధికారులు సాంప్రదాయక దుస్తులు ధరించి సందడి చేశారు. సంబరాల్లో ఏర్పాటు చేసిన సంక్రాంతి లోగిళ్లు ప్రతి ఒక్కరికి గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసింది. ఈ సందర్భంగా నగర కమిషనర్ పులి శ్రీని వాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంబరాల్లో పాల్గొని ఆనందంగా గడపాలని సూచించారు. ఎమ్మెల్యే గల్లా మాదవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో భోగ భాగ్యాలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం జెకెసి కాలేజి గ్రౌండ్‌లో విలేకరులు, జిఎంసి ఉద్యోగుల టీంలకు క్రికెట్ మ్యాచ్‌లను కమిషనర్ టాస్ వేసి ప్రారంభించారు. పోటీల్లో జిఎంసి కమిషనర్ టీం విజేతగా, జిఎంసి ఉద్యోగుల టీం రన్నర్స్‌గా నిలిచాయి. సాయంత్రం సంబరాల్లో డప్పు వాయిద్యం, చెక్క భజన, తంబోలా, సాంప్రదాయ వస్త్ర పోటీలు, కూచిపూడి, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలను నగర ప్రజలు ఎంతో ఆసక్తితో పెద్ద సంఖ్యలో తిలకించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




భోగిపళ్లు పోస్తున్న కమిషనర్, ఎమ్మెల్యే, తదితరులు





చెక్కభజనలో పాల్గొన్న కళాకారులు



మాజీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద చింపి వేసిన ఫ్లెక్సీలు



దాడిలో గాయపడ్డ శంకరరావు అనుచరుడు

మాజీ ఎమ్మెల్యే కార్యాలయంపై దాడి

ఆరుగురికి గాయాలు, ఫ్లెక్సీలు చింపివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకర్రావు కార్యాలయంపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గతంలో శంకరరావుతో విభేధించి వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్లిన ముగ్గురు నాయకుల్లో కొంత మంది ఈ దాడికి పాల్పడ్డట్టు అనుమానిస్తున్నారు. కంభం పాడు నుంచి వచ్చిన ఐదుగురు వ్యక్తులు కర్రలతో వచ్చి దాడి చేసినట్లు సమాచారం. ఫెక్సీలు చింపి వేశారు. రాళ్లతో దాడి చేసి కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. శంకరరావు కారు డ్రైవర్ ను కర్రలతో తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనలో మేనేజర్ నరేంద్ర, డ్రైవర్ జగదీష్, కార్యాలయ ఉద్యోగులు చైతన్యతోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నంబూరు శంకరరావు ఈవిషయాన్ని జిల్లా ఎస్పి సతీష్‌కుమార్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి అంబటి రాంబాబు కూడా ఎస్పికి ఫిర్యాదు చేశారు. ఎస్పి ఆదేశాల మేరకు నల్లపాడు సిఐ వంశీధర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. శంకరరావు కార్యాలయాన్ని అంబటి రాంబాబుతోపాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి నాయకులు నిమ్మకాయల రాజ్‌నారాయణ తదితరులు సందర్శించారు. క్షతగాత్రులను పరామర్శించారు.